

## బాల్కొండ ఎస్సైపై చర్యలు తీసుకోవాలి

2



## ఓంకారేశ్వర ఆలయ వార్షికోత్సవం

2


AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatoday.in


## గుండెపోటుతో హెడ్ కానిస్టేబుల్ మృతి



**అక్షరటుడే, కామారెడ్డి:** రామారెడ్డి పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న కృష్ణమూర్తి గురువారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. మూడేళ్లుగా రామారెడ్డిలో విధు లు నిర్వర్తిస్తున్నారు. అయితే కొద్దిరోజుల పాటు రామారెడ్డిలోనే నివాసం ఉన్న ఆయన ఇటీవల హైదరాబాద్ నుంచి రామారెడ్డికి రాకపోకలు సాగిస్తున్నారు. గురువారం ఉదయం అకస్మాత్తుగా గుండెపోటుతో మృతి చెందాడు. దీంతో రామారెడ్డి పోలీస్ స్టేషన్‌లో విషాదం నెలకొంది. మరో ఐదారు నెలల్లో ఆయన పదవీవిరమణ ఉన్నట్టుగా తెలుస్తోంది.



## ఇందూరులో మెరిసిన 'నిధి'



**అక్షరటుడే, ఇందూరు:** నగరంలోని రాష్ట్రపతి రోడ్డులో ఆర్ఎస్ బ్రదర్స్ నూతన షోరూంను గురువారం ప్రారంభించారు. ప్రముఖ హీరోయిన్ నిధి అగర్వాల్ వస్త్ర దుకాణాన్ని ప్రారంభించి సందడి చేశారు. హీరోయిన్ నిధి అగర్వాల్‌ను చూసేందుకు అభిమానులు భారీగా తరలిరావడంతో ప్రాంగణం కిక్కిరిసిపోయింది. అభిమానులకు అభివాదం చేస్తూ నిధి అగర్వాల్ కాసేపు సందడి చేసింది. షో రూంలోని అన్ని విభాగాలను ప్రారంభించి సిబ్బందితో ఫొటోలకు ఫోజు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నిజామాబాద్‌లో ఆర్ఎస్‌బ్రదర్స్ మొదటి షోరూం ప్రారంభించామని నాణ్యమైన వస్త్రాలు అందుబాటులో ఉంటాయన్నారు. ప్రతిఒక్కరూ ఆదరించాలని కోరారు. కాగా.. హీరోయిన్ రాక సందర్భంగా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో షోరూం ప్రతినిధులు పాల్గొన్నారు.

## కనులపండువగా లక్ష్మీనృసింహునికి ఊయల సేవ



**అక్షరటుడే, భీమ్‌గల్:** పట్టణంలోని గ్రామాలయంలో లక్ష్మీనృసింహస్వామి డోలోత్సవ వేడుక అంగరంగ వైభవంగా జరిగింది. హోలీ పర్వదినాన్ని పురస్కరించుకొని క్షేత్రంలో భక్తి భావం వెల్లివిరిసింది. ఫాల్గుణ పూర్ణిమ పర్వదినం సందర్భంగా ఉత్తర ఫల్గుణి నక్షత్రయుక్త శుభ ఘడియల్లో స్వామివారికి ఈ డోలోత్సవ కార్యక్రమాన్ని అర్చకులు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉత్సవంలో భాగంగా స్వామివారి ఉత్సవ మూర్తులకు విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించిన అనంతరం రంగురంగుల పుష్పాలతో అలంకరించిన ఊయలలో స్వామి, అమ్మవార్లను అధిష్ఠింపజేశారు. వేద మంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల మధ్య స్వామివారిని ఊయల ఊగిస్తూ భక్తులు దర్శించుకున్నారు.

## మేయర్‌కు సన్మానం



**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** నగర మేయర్ ఉమారాణి రమేష్‌ను గురువారం మెడికవర్ ఆస్పత్రి మేనేజ్‌మెంట్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మేయర్ దంపతులను ఘనంగా సన్మానించారు. మేయర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. నగరాభివృద్ధికి తమవంతు సహాయ సహకారాలు అందజేస్తామని పేర్కొన్నారు. నగర అభివృద్ధి, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే అంశాలపై పరస్పరం చర్చించారు.

అంగన్‌వాడీ కేంద్రాలను మరింత మెరుగుపరిచేందుకు కేంద్ర ప్రభుత్వం నడుం బిగించింది. మౌలిక సదుపాయాలు కల్పించేలా ప్రణాళిక రూపొందించింది. చిన్నారులకు, గర్భిణులకు ఇబ్బందులు కలగకుండా సకల సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా ప్రతి అంగన్‌వాడీ కేంద్రానికి విద్యుత్ కనెక్షన్లు ఉచితంగా అందించనున్నారు.

- అక్షరటుడే, ఇందూరు




# అంగన్‌వాడీలకు వెలుగులు

- విద్యుత్ లేనివాటికి ఉచితంగా విద్యుత్
- ఇప్పటికే 378 కేంద్రాలకు కనెక్షన్లు

నిజామాబాద్ జిల్లాలో మొత్తం ఐదు ప్రాజెక్టులు ఉన్నాయి. ఇందులో నిజామాబాద్ అర్బన్, ఆర్మూర్, బోధన్, భీమ్‌గల్, డిచ్‌పల్లి పరిధిలో 1501 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో సొంత భవనాలు 504, కిరాయి భవనాలు 612, అద్దలేని భవనాలు 385 ఉన్నాయి. ఇందులో 829 అంగన్‌వాడీ కేంద్రాలకు విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. మిగతా 672 కేంద్రాలకు విద్యుత్ కనెక్షన్ లేకుండానే కొనసాగుతున్నాయి. అయితే కేంద్ర ప్రభుత్వం "ధర్తీ జన జాతీయ గ్రామ్ ఉత్కర్ష అభియాన్" పథకంలో భాగంగా త్వరలో అన్నింటికీ ఉచిత విద్యుత్ కనెక్షన్లు ఇవ్వనున్నారు. ప్రస్తుతం వేసవికాలం కావడం, ఉష్ణోగ్రతలు అమాంతం పెరుగుతుండడంతో.. వేడి నుంచి ఉపశమనం కలిగించనున్నారు.

### ఎన్‌పీడీసీఎల్ చురుకుగా..

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉచిత విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడంలో ఎన్‌పీడీసీఎల్ చర్యలు చేపట్టింది. ఇప్పటికే నిజామాబాద్ సర్కిల్ పరిధిలో 378 కేంద్రాలకు విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేసినట్లు అధికారులు తెలిపారు. మరికొన్ని కేంద్రాల్లో పనులు కొనసాగుతున్నాయి. అయితే కేవలం కనెక్షన్లు ఇవ్వడమే కాకుండా అంతర్గతంగా వైరింగ్ పనులను కూడా చేస్తున్నారు. ఇప్పటికే సగానికి పైగా కేంద్రాల్లో విద్యుత్ కనెక్షన్ల పనులు పూర్తయ్యాయి. నెలాఖరులోపు మిగతా పనులు పూర్తిచేసేలా ప్రణాళిక రూపొందించారు.

### ఎన్నో ఏళ్లకు మోక్షం..

జిల్లాలో అనేక సంవత్సరాలుగా కొన్ని అంగన్‌వాడీ కేంద్రాలు చీకటిలోనే కొనసాగాయి. చాలా కేంద్రాల్లో వంట గదులు చిన్నవిగా ఉండడం, వెలుతురు సరిగ్గా లేకపోవడంతో వంట చేసే సమయంలో ఇబ్బందులు తప్పలేదు. ప్రధానంగా సొంత భవనాలు, అద్దె లేని భవనాల్లో ఈ సమస్య అధికంగా ఉంటుంది. దీంతో ఆరుబయట వంట చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఇక వేసవికాలం వస్తే ఎండ వేడి, ఫ్యాన్లు లేకపోవడంతో చిన్నారులు తట్టుకోలేని పరిస్థితి ఉండేది. ప్రస్తుతం ఉచిత విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడంతో సమస్యలన్నిటికీ చెక్ పడనుంది.

## రేపు జిల్లాకు ఎంపీలు ఈటల, అర్వింద్ రాక..



**అక్షరటుడే, ఇందూరు:** నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో నూతనంగా గెలుపొందిన బీజేపీ కౌన్సిలర్లు, కార్పొరేటర్లకు ఈనెల 6న ఆత్మీయ అభినందన సభ నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి తెలిపారు. ఈ మేరకు గురువారం ప్రకటన విడుదల చేశారు. మాధవ నగర్‌లోని కమ్మ సంఘంలో ఉదయం 10 గంటలకు సభ ఉంటుందన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మేడ్చల్ మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్, ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, రాకేష్ రెడ్డి పసుపు బోర్డు జాతీయ ఛైర్మన్ పల్లె గంగారెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి స్రవంతి రెడ్డి, జిల్లా ప్రబారి కాంతారావు హాజరవుతారని పేర్కొన్నారు. కావున పార్టీ జిల్లా పదాధికారులు, రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు, వివిధ మోర్చాల జిల్లా పదాధికారులు, మండల అధ్యక్షులు, సర్పంచులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

## యువతే దేశానికి అమూల్యమైన సంపద..




**అక్షరటుడే, కామారెడ్డి:** యువతనే దేశానికి అమూల్యమైన సంపద అని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధు మోహన్ అన్నారు. పట్టణంలోని ఆర్కే డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో గురువారం వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్-2026 కార్యక్రమంలో భాగంగా జిల్లాస్థాయి పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. యువత నిర్మాణాత్మక మార్గం వైపు వెళ్లాలని సూచించారు. దేశానికి మనం ఏం ఇవ్వగలమని ఆలోచించాలన్నారు. ప్రతి ఒక్కరిలో పోటీతత్వం ఉండాలని, అప్పుడే ఎంచుకున్న లక్ష్యాన్ని సాధిస్తామన్నారు. అనంతరం ఉత్తమంగా మాట్లాడిన ఐదుగురు విద్యార్థులను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారు. వారిలో వరుసగా యాస్మిన్ సుల్తానా, సుదీక్షా రెడ్డి, అంజలి, సుధాంశ్, హర్షిణి ఉన్నారు. ఎంపికైన వారిని అభినందించారు. కార్యక్రమంలో జిల్లా నోడల్ అధికారి షేక్ సలాం, ఆర్కే కళాశాలల సీఈవో జైపాల్ రెడ్డి, డీవైవో శైలి బెల్లాల్, సౌత్ క్యాంపస్ ప్రొఫెసర్ అంజయ్య, తెలంగాణ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ ప్రొఫెసర్ అపర్ణ, జిల్లా స్పోర్ట్స్ అధికారి వెంకటేశ్వర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## ఎల్లారెడ్డి ఆర్డీవోకు సన్మానం

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి పట్టణానికి పదోన్నతిపై వచ్చిన ఆర్డీవో ప్రభాకర్‌ను కామారెడ్డి జిల్లా రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు నాగం సురేందర్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఎల్లారెడ్డి మండల రేషన్ డీలర్లతో కలిసి ఆయన ఆర్డీవోకు పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి మండల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు విఠల్ గౌడ్, మామిడి శ్రీనివాస్, ఆగమయ్య, కృష్ణమూర్తి, మహేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బస్సు ప్రమాదం.. డీటీకి గాయాలు..

**అక్షరటుడే, కామారెడ్డి:** బస్సు దిగుతుండగా అదుపు తప్పి కిందపడి డిప్యూటీ తహశీల్దార్ గాయాలపాలయ్యాడు. ఈ ఘటన కామారెడ్డి పట్టణంలో గురువారం చోటు చేసుకుంది. మద్నూర్ డిప్యూటీ తహశీల్దార్‌గా విధులు నిర్వర్తిస్తున్న శరత్ కుమార్ కరీంనగర్ నుంచి కామారెడ్డికి ఆర్టీసీ బస్సులో ఉదయం వచ్చారు. బస్టాండ్ లోపలికి బస్సు టర్న్ అవుతుండగా ఆయన కిందికి దిగారు. ఈ క్రమంలో అదుపుతప్పి బస్సు కిందపడ్డారు. దీంతో ఆయన కుడికాలుపై నుంచి టైరు వెళ్లింది. వెంటనే స్థానికులు గమనించి ఆయనను కామారెడ్డి జీజీహెచ్‌కు తరలించారు. వైద్యులు పరిశీలించి కాలు విరిగిందని ధృవీకరించారు. ప్రస్తుతం ఆయన ఆస్పత్రిలో చికిత్సపొందుతున్నాడు.

## ఎర్రజొన్న పంటను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి



**అక్షరటుడే, ఆర్మూర్:** ఎర్రజొన్న పంటను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రైతు నాయకుడు అల్లూరి గంగారెడ్డి ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆర్మూర్ డివిజన్‌లో అత్యధికంగా పండే ఎర్రజొన్న పంట సాగు విస్తీర్ణం ఈ ఏడాది గణనీయంగా తగ్గిందన్నారు. వాతావరణ పరిస్థితుల కారణంగా పంట దిగుబడి తగ్గిందని, వ్యాపారులు ఈసారి రేటు తక్కువ చేసి కొనుగోలు చేస్తున్నారని ఆయన వాపోయారు. గతేడాది క్వింటాలుకు రూ.3,500 నుంచి రూ.3,850 వరకు ధర పెట్టి కొనుగోలు చేశారని, ఈసారి మాత్రం రూ.3,500కు మాత్రమే కొనుగోలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకొని ఎర్రజొన్న పంటను క్వింటాలుకు రూ.4,500కు ప్రభుత్వం కొనుగోలు చేసి ఎర్రజొన్న రైతులను ఆదుకోవాలని ఆయన కోరారు.

## పథకాలను పక్కాగా అమలుచేయాలి: కలెక్టర్



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ప్రభుత్వ పథకాలను పక్కాగా అమలు చేయలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశించారు. రామారెడ్డి మండలం గొల్లపల్లిలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారులు మెరుగు లక్ష్మి, రాజయ్య నిర్మించుకుంటున్న ఇంటి పనుల పురోగతిని కలెక్టర్ ప్రత్యక్షంగా పరిశీలించారు. నిర్మాణ పనులు నాణ్యతగా.. త్వరితగతిన పూర్తిచేయాలని, ఉగాదిలోగా ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధిదారులకు అందుతున్న సౌకర్యాల గురించి ఆరా తీశారు. అనంతరం గొల్లపల్లి గ్రామంలోని మండల ప్రాథమిక పాఠశాలను సందర్శించిన కలెక్టర్ పాఠశాలలోని వంటగదిని పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందిస్తున్న తీరును సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు పోషకాహారం అందేలా ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థులకు రాగి జావాపై ఇస్తున్నారా లేదా అని ఆరాతీశారు. ఈ సందర్భంగా పాఠశాల నిర్వహణ, విద్యార్థుల హాజరు, మౌలిక వసతులపై కలెక్టర్ వివరాలు తెలుసుకున్నారు. పాఠశాలల్లో పరిశుభ్రత, నాణ్యమైన ఆహారం, విద్యార్థుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టిపెట్టాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థుల అభ్యాస సామర్థ్యాలను కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీవో వీణ, తహశీల్దార్, పీడీ హౌసింగ్ విజయపాల్ రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాజ్యాధికార పార్టీలో చేరికలు

**అక్షరటుడే, బాన్సువాడ:** తెలంగాణ రాజ్యాధికార పార్టీలో భారీ చేరికలు జరిగాయి. రాష్ట్ర పార్టీ కార్యాలయంలో పార్టీ చీఫ్, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న సమక్షంలో రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి జిల్లా ఇన్‌ఛార్జి ఆకుల హన్మాండ్లు, కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ తాహిర్ ఆధ్వర్యంలో వివిధ పార్టీలకు చెందిన పలువురు నేతలు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా తీన్మార్ మల్లన్న వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కామారెడ్డి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సబ్బిడి రమేష్‌ను, బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌ఛార్జీగా గాండ్ల సుధీర్ కుమార్‌ను, బోర్లం గ్రామ కమిటీ అధ్యక్షుడిగా గాండ్ల అశోక్‌ను నియమించి వారికి నియామకపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌ఛార్జి గాండ్ల సుధీర్ కుమార్ మాట్లాడుతూ.. ప్రజల ఆశయాలు, ఆకాంక్షలను నెరవేర్చడమే తమ పార్టీ ప్రధాన లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు డోంగ్లి శ్రీనివాస్, కళ్లెం రాజు, రైతు విభాగం అధ్యక్షుడు సింగారపు సిద్దయ్య, పీడీఎస్ జిల్లా అధ్యక్షుడు బాలరాజ్, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## మాల్‌ప్రాక్టీస్ జరగకుండా చర్యలు తీసుకోవాలి: కలెక్టర్ ఇలాత్రిపాఠి



**అక్షరటుడే, బోధన్:** ఇంటర్ పరీక్షల్లో మాల్‌ప్రాక్టీస్ జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. పట్టణంలోని ఇంటర్ పరీక్షా కేంద్రాలను ఆమె గురువారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. పట్టణంలోని విజేత జూనియర్ కళాశాల, ఉషోదయ, విద్యా వికాస్ జూనియర్ కాలేజీలలో కొనసాగుతున్న పరీక్షా కేంద్రాలను కలెక్టర్ తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రాల్లో అందుబాటులో ఉన్న తాగునీరు, టాయిలెట్స్ వంటి సౌకర్యాలను పరిశీలించారు. సీసీ కెమెరా నిఘాలో పరీక్షలు జరుగుతున్నాయా లేదా అని గమనించారు. పలు కేంద్రాల్లో లోపాలను గమనించిన కలెక్టర్ సంబంధిత అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. మాల్ ప్రాక్టీస్ జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బోధన్ పట్టణంలోని అన్ని పరీక్షా కేంద్రాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి తనకు వివరాలు తెలియజేయాలని డీఐఈవో రవికుమార్‌ను ఆదేశించారు. పరీక్షల్లో భాగంగా గురువారం ఫస్టియర్ గణితం 1బీ, జువాలజీ, హిస్టరీ సబ్జెక్టులకు సంబంధించిన పరీక్ష జరగగా, ఆయా కేంద్రాల్లో గైర్హాజరైన విద్యార్థుల సంఖ్య గురించి కలెక్టర్ ఆరా తీశారు. విజేత జూనియర్ కళాశాలలో మొత్తం 441 మందికి గాను 12మంది గైర్హాజరయ్యారని చీఫ్ సూపరింటెండెంట్ స్వర్ణలత తెలిపారు. ఉషోదయ కాలేజీలోని సెంటర్‌లో 358 మందికి గాను 21 మంది హాజరు కాలేదని చీఫ్ సూపరింటెండెంట్ అనిల్ కలెక్టర్ దృష్టికి తెచ్చారు. అలాగే, విద్యావికాస్ జూనియర్ కాలేజీలోని సెంటర్‌లో 406 మంది విద్యార్థులకు 398 మంది హాజరయ్యారని కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ రవీందర్ తెలిపారు.

## విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ..



**అక్షరటుడే, భీమ్‌గల్:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో గురువారం 'స్వయం పాలన దినోత్సవం' ఉత్సాహంగా జరిగింది. పాఠశాల హెచ్‌ఎం రాజన్న పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. పాఠశాల హెచ్‌ఎంగా శ్రీనిజ, ఉప ప్రధానోపాధ్యాయురాలుగా ఈశ్వరి బాధ్యతలు నిర్వహించారు. మొత్తం 50 మంది విద్యార్థులు వివిధ సబ్జెక్టుల ఉపాధ్యాయులుగా మారి తరగతుల్లో బోధన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థులు తమ అనుభవాలను పంచుకున్నారు. ఉపాధ్యాయ వృత్తి ఎంతో బాధ్యతతో కూడుకున్నదని, పాఠాలు బోధించడం సంతోషంతో పాటు సవాలుగా అనిపించిందని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు ప్రభాకర్, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు బోడ దేవానందం, ఉపాధ్యాయులు మనోహర్, శైలజ, ప్రసాద్ తదితరులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.


## రవన్న వర్ధంతి సభను జయప్రదం చేయండి



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ/భీమ్‌గల్:** విప్లవ పంథా కోసం తుదిశ్వాస వరకు పోరాడిన గొప్ప యోధుడు కామ్రేడ్ రాయల రవన్న (సుభాష్ చంద్రబోస్) అని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజా పంథా) రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు వి.ప్రభాకర్ కొనియాడారు. గురువారం మండలంలోని గడ్కోల్ గ్రామం లో రాయల రవన్న 10వ వర్ధంతి సభ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ.. రవన్న 40ఏళ్ల పాటు అజ్ఞాత జీవితం గడిపి, విప్లవకారుల ఐక్యత కోసం అహర్నిశలు శ్రమించారని గుర్తుచేశారు. సమకాలీన పరిస్థితుల్లో ప్రజా పంథాను మరింత బలోపేతం చేయడమే ఆయనకు ఇచ్చే అసలైన నివాళి అని ప్రభాకర్ పేర్కొన్నారు. పిడివాద ధోరణులను ఎండగడుతూ బలమైన ప్రజా ఉద్యమ నిర్మాణానికి విప్లవ శ్రేణులు నడుం బిగించాలని పిలుపునిచ్చారు. ఈ నెల 10న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్న వర్ధంతి సభకు ఉమ్మడి జిల్లా నుంచి విప్లవ శ్రేణులు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు పి.రామకృష్ణ, జిల్లా నాయకులు ఆర్.రమేష్, డివిజన్ నాయకులు దామోదర్, బాబన్న, కిశోర్, అనీస్, సాయిరెడ్డి, మండల నాయకులు లింబాద్రి, నారాగౌడ్, రమేష్, బాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజకీయంగా మహిళలకు చేయూతనివ్వాలని, వారికి పురుషులతో సమానంగా అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాలు సంకల్పించాయి. ఇందుకోసం స్థానిక సంస్థల ఎన్నికల్లో 50శాతం రిజర్వేషన్లు కల్పించాయి. దీనికి తగ్గట్లుగా మహిళలు ముందుకొచ్చి పోటీచేసి విజయాలు సాధిస్తున్నారు. అయితే ప్రభుత్వం అనుకున్న లక్ష్యం పక్కదారి పడుతోంది. పదవుల్లో భార్యలు ఉన్నప్పటికీ భర్తలే ఆజమాయిషీ చేస్తూ గ్రామ రాజకీయాల్లో చక్రం తిప్పుతున్నారు.

– అక్షరటుడే, గాంధారి




# పదవుల్లో సతులు..

# పవర్‌లో పతులు..

- ఇళ్లకే మహిళా ప్రజాప్రతినిధులు పరిమితం
- పెత్తనం చలాయిస్తున్న వారి భర్తలు
- జీపీల నుంచి కార్పొరేషన్ వరకు వారిదే హవా..
- తలలు పట్టుకుంటున్న అధికారులు..

కామారెడ్డి జిల్లాలో 25 మండల కేంద్రాల్లో సర్పంచ్ పదవులకు మహిళలకే రిజర్వేషన్లు కేటాయించారు. ప్రతి మండల కేంద్రంలో సగానికి పైగా పంచాయతీల్లో మహిళలే గెలిచారు. రెండు టర్మ్‌ల తర్వాత మహిళలు అవకాశాలు రావడంతో ఎక్కువ సంఖ్యలో మహిళలు సర్పంచ్, కౌన్సిలర్ల స్థానాలకు పోటీ చేసేందుకు ఆసక్తి చూపారు.

### కామారెడ్డి జిల్లాలో..

జిల్లాలోని 25 మండలాల కేంద్రాల్లో, బాన్సువాడలో 25 గ్రామ పంచాయతీలకు గాను 12 జీపీల్లో, తాడ్వాయిలో 18 గాను 8, బిచ్కుందలో 23లో 11, బీర్కూర్ 13లో 5 స్థానాలకు మహిళలకు కేటాయించారు. డోంగ్లిలో 13కు గాను 5, జుక్కల్‌లో 30లో 14, మద్నూర్ లో 21లో 9, మహమ్మద్ నగర్ 13లో 6, నస్రుల్లాబాద్ 19లో 9 స్థానాలకు మహిళలకు రిజర్వ్ చేశారు. అలాగే నిజాంసాగర్ 14లో 6, పెద్దకొడప్‌గల్ 25లో 10, పిట్లం 26లో 13, గాంధారి 45 లో 22, లింగంపేట్ 41లో 19, నాగిరెడ్డిపేట్ 27లో 12, ఎల్లారెడ్డి 31లో 14, సదాశివ నగర్ 24లో 11, రామారెడ్డి 18లో 9, పాల్వంచ 12 లో 5, భిక్కనూరులో 18లో 8, బీబీ పేట్ 11లో 5, దోమకొండ 9లో 4, కామారెడ్డి 14లో 5, మాచారెడ్డి 25లో 12, రాజంపేట 18లో 8 స్థానాలు మహిళలకు కేటాయించబడ్డాయి.

### వారిదే రాజ్యం..

జిల్లాలో పలు పంచాయతీల్లో సర్పంచ్‌లు మహిళలు అయినా గ్రామాల్లో భర్తలే పెత్తనం చెలాయిస్తున్నారు. గ్రామ పంచాయతీలో పర్యటనలు, కార్యదర్శులకు, అంగన్‌వాడీ టీచర్లకు, ఏఎన్ఎంలకు గ్రామంలో ఏ పనైనా మహిళ సర్పంచ్‌ల భర్తలు చెప్పిందే ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బంది చేయాల్సిన పరిస్థితి ఉంది. పంచాయతీలో పర్యటనలు, కార్యదర్శులకు, అంగన్‌వాడీ టీచర్లకు, ఏఎన్ఎంలకు గ్రామంలో ఏ పని అయినా మహిళ సర్పంచ్‌ల భర్తలు చెప్పిందే ప్రభుత్వ ఉద్యోగులు చేయాల్సిన పరిస్థితి ఉంది.

### రబ్బర్ స్టాంప్‌లుగా..

నియోజకవర్గంలోని చాలా గ్రామాల్లో మహిళా ప్రజాప్రతినిధులు కేవలం రబ్బర్ స్టాంప్‌లుగా మారారు. వారు కొత్తగా రాజకీయాల్లోకి రావడం.. గ్రామ పాలనపై అవగాహన లేకపోవడంతో భర్తలే అన్నీ దగ్గరుండి చూసుకుంటున్నారు. అవసరమైన చోట సంతకాల కోసమే మహిళా సర్పంచ్‌లు పనిచేస్తున్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం



**అక్షరటుడే, బాల్కొండ:** బాల్కొండ ఉమ్మడి మండలంలో పోలీస్‌శాఖ లయన్స్ క్లబ్, మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ముప్కాల్ శివారులోని పెట్రోల్ పంప్ వద్ద ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో సుమారు 100 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్మూర్ లయన్స్ కంటి ఆస్పత్రి వైద్యులు భుజంగరెడ్డి, పుణ్యరాజు, లయన్స్ క్లబ్ జిల్లా ఛైర్మన్ చాకు లింగం, జోనల్ ఛైర్మన్ జ్ఞానసాగర్ రెడ్డి, బాల్కొండ ఎస్సై శైలేందర్, మెండోరా ఎస్సై సుహాసిని, ముప్కాల్ ఏఎస్సై సాయన్న పాల్గొన్నారు.

## డ్రైవర్లకు ఉచిత కంటి, వినికిడి పరీక్షలు



**అక్షరటుడే, బోధన్:** పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ బోధన్ ఆధ్వర్యంలో 'అరైవ్ అలైవ్' కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కంటి వైద్య నిపుణురాలు బెనిట జాన్, ఆడియాలజిస్ట్ బిపిన్ డ్రైవర్లకు పరీక్షలు చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఏసీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ డ్రైవర్లు రోడ్లపై సురక్షితంగా ప్రయాణం చేయడానికి కంటిచూపు, వినికిడి సరిగా ఉండటం ఎంతో అవసరమని తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధి భశ్వేశ్వర్ రావు, విద్యావికాస్ ఛైర్మన్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## సాయిసన్నిధిలో ఆధ్యాత్మిక శోభ.. భక్తిశ్రద్ధలతో పల్లకీసేవ



**అక్షరటుడే, భీమ్‌గల్:** వేల్పూర్ మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో గురువారం ఆధ్యాత్మిక కార్యక్రమాలు కనులపండువగా జరిగాయి. ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో భక్తులు బాబా పల్లకీని ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. భజన బృందాల సంకీర్తనలు, కోలాటాల మధ్య పల్లకీసేవ భక్తి పారవశ్యంలో సాగింది. శివాలయంలో అర్చకులు బోనగిరి గంగాధర్ ఆధ్వర్యంలో భక్తులు సత్యనారాయణ స్వామి వ్రతాలు ఆచరించారు. అన్నదానం అన్ని దానాల కన్నా మిన్న అని చాటుతూ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహా అన్నదానం నిర్వహించారు. కార్యక్రమానికి జాగిర్యాలకు చెందిన బొంగు వాణినవీన్ గౌడ్ కుటుంబ సభ్యులు, అమెరికాలో ఉంటున్న మోతె గ్రామానికి చెందిన పోతుగంటి సౌమ్యబాలరాజు దంపతులు అన్నదాతలుగా వ్యవహరించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు కమిటీ సభ్యులు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బాల్కొండ ఎస్సైపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు



**అక్షరటుడే, ఆర్మూర్:** బాల్కొండ ఎస్సై సైలేందర్‌పై చర్యలు తీసుకోవాలని ఖాజీపురాకు చెందిన ఎం.ఏ. ఇమ్రాన్ ఖాన్ ఆర్మూర్ ఏసీపీకి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎంఐఎం జిల్లా అధ్యక్షుడు ఫయాజ్ ఆధ్వర్యంలో గురువారం ఫిర్యాదు అందజేశారు. మార్చి 2న సమయంలో ఖాజీపురాలోని ఆలంగీర్ మసీదు ప్రాంగణంలో సయీద్ ఫాసి అహ్మద్ (షేరు), షోయబ్ అనే వ్యక్తులు సుమైర్ అనే వ్యక్తిని కొట్టాడని పేర్కొన్నారు. ఆ సమయంలో గొడవను ఆపేందుకు ఇమ్రాన్ ఖాన్ సోదరుడు అబ్దుల్ ఇర్ఫాన్ ఖాన్ జోక్యం చేసుకుని రంజాన్ నెల కావడంతో మసీదు ప్రాంగణంలో గొడవ చేయొద్దని ఇరువర్గాలను కోరాడన్నారు. అయితే సయీద్ ఫాసి అహ్మద్ పోలీసులకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని అబ్దుల్ ఇర్ఫాన్ ఖాన్‌ను పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారని వివరించాడు. అనంతరం సయీద్ ఫాసి అహ్మద్.. సుమైర్, అబ్బూ, అబ్దుల్ ఇర్ఫాన్ ఖాన్‌లపై పోలీసులకు ఫిర్యాదు చేశాడన్నారు. దీనిపై బాల్కొండ ఎస్సై సైలేందర్ ముగ్గురిని పోలీస్ స్టేషన్‌కు పిలిపించి సరైన విచారణ చేయకుండా ఫైబర్ స్టిక్‌లతో తీవ్రంగా కొట్టారని ఫిర్యాదులో ఆరోపించారు. ఘటనలో అబ్దుల్ ఇర్ఫాన్ ఖాన్, సుమైర్, అబ్బూ తీవ్ర గాయాలయ్యాయని వివరించారు. ఈ విషయంపై మార్చి 3న బాల్కొండ సీఐకి ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదని తెలిపారు. ఘటనపై విచారణ జరిపి ఎస్సైపై చర్యలు తీసుకోవాలని ఏసీపీని కోరారు.

## మొక్కజొన్న విక్రయించిన డబ్బులు రైతులకు చెల్లించాలి




**అక్షరటుడే, గాంధారి:** మూడునెలల క్రితం ప్రభుత్వానికి మొక్కజొన్న విక్రయించిన డబ్బులు ఇప్పటికీ రైతులకు చెల్లించలేదని.. వెంటనే చెల్లించాలని బీజేపీ మండలాధ్యక్షుడు మధుసూదన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలో రైతులతో కలిసి నెహ్రూ చౌరస్తా ప్రధాన రహదారిపై రైతుధర్నా నిర్వహించారు. బీజేపీకి భారతీయ కిసాన్ సంఘ్, బీఆర్ఎస్ నాయకులు, వీడీసీ సభ్యులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూణ్నెళ్ల క్రితం రైతుల నుంచి కొనుగోలు చేసిన మొక్కజొన్నల డబ్బులు ఇంతవరకు ప్రభుత్వం చెల్లించకపోవడం విచారకరమన్నారు. దీంతో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతులకు ఇవ్వాల్సిన డబ్బులతో ప్రభుత్వాన్ని నడుపుతున్న ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని ఎద్దేవా చేశారు. అధికారులు స్పందించి వెంటనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయకపోతే కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తామని రైతులు పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

## డ్రంకన్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలుశిక్ష

**అక్షరటుడే, ఆర్మూర్:** డ్రంకన్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలుశిక్ష విధిస్తూ ఆర్మూర్ న్యాయస్థానం తీర్పునిచ్చింది. ఈ మేరకు ఆర్మూర్ ఎస్‌హెచ్‌ఎవో సత్యనారాయణ గౌడ్ వివరాలు వెల్లడించారు. పట్టణంలో స్పెషల్ డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టగా 11 మంది మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించామన్నారు. అనంతరం వారిని కోర్టులో హాజరుపర్చగా 9మందికి రూ.10వేల చొప్పున జరిమానా విధించారని.. ఇద్దరికి ఐదు రోజుల చొప్పున సాధారణ జైలుశిక్ష విధిస్తూ న్యాయస్థానం తీర్పునిచ్చినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే మోటార్ వెహికల్ నూతన చట్టం ప్రకారం భారీగా జరిమానాలు, జైలుశిక్ష విధించడం జరుగుతుందని ఆయన తెలిపారు.

## ఇంటర్ పరీక్షలో చూచిరాత కేసు నమోదు

**అక్షరటుడే, ఇందూరు:** ఇంటర్ ఫస్టియర్ పరీక్షలో మాల్‌ప్రాక్టీస్ చేస్తూ ఓ విద్యార్థి పట్టుబడ్డాడు. డిచ్‌పల్లి మోడల్ స్కూల్ జూనియర్ కళాశాలలో విద్యార్థి మాల్ ప్రాక్టీస్ చేస్తుండగా ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఇంటర్ విద్యాధికారి రవికుమార్ తెలిపారు. గురువారం గణితం 2 బీ, జువాలజీ, హిస్టరీ, వొకేషనల్ పరీక్షలు నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా 17,637 మంది విద్యార్థులకు గాను.. 17,101 మంది హాజరయ్యారు. 536 మంది గైర్హాజరయ్యారు. ఇంటర్ విద్యాధికారి మూడు కేంద్రాలను, పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు 19, హైపవర్ కమిటీ 6, సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 29 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశాయి.

## కెనాల్‌లో బోల్తాపడ్డ కారు.. ఇద్దరు మృతి




**అక్షరటుడే నిజామాబాద్ క్రైం:** కెనాల్‌లో కారు బోల్తాపడగా ఇద్దరు మృతి చెందారు. ఈ ఘటన నిజామాబాద్ బైపాస్ సమీపంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. ఘటనా స్థలాన్ని సీపీ సాయిచైతన్య పరిశీలించారు. కామారెడ్డి జిల్లా దోమకొండ ప్రాంతానికి చెందిన చింతల శ్రీనివాస్ ఇటుకల బట్టీ వ్యాపారస్తుల వద్ద పని చేస్తున్నాడు. అయితే బట్టీలో పనిచేసేందుకు కార్మికుల కోసం నాందేడ్ వెళ్లాడు. అక్కడ ఓ కుటుంబంతో బట్టీలో పనిచేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. వారితో దోమకొండకు తిరుగుప్రయాణమయ్యాడు. ఈ క్రమంలో గురువారం తెల్లవారుజామున నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని బైపాస్ రోడ్డు ప్రాంతంలో కారు అదుపుతప్పి కెనాల్ పైనుంచి నీళ్లలో పడిపోయింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. మరో నలుగురికి గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సీపీ వెంట డిచ్‌పల్లి ఎస్సై ఎండీ ఆరిఫ్, నిజామాబాద్ రూరల్ ఎస్‌హెచ్‌వో శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## 30న ఎస్సీల నిరాహార దీక్ష



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** ఎస్సీలకు ప్రభుత్వ పథకాలను అమలు చేయకపోవడాన్ని నిరసిస్తూ ఈనెల 30వ తేదీన నిరాహార దీక్ష చేపట్టనున్నట్టు ఎమ్మార్పీఎస్ నగర అధ్యక్షుడు మల్లమారి సుధాకర్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో మహిళా విభాగం ప్రతినిధి పోసాని తదితరుల ఆధ్వర్యంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ అభయహస్తం పథకం కింద ప్రతి దళిత కుటుంబానికి రూ.12 లక్షల ఆర్థిక సాయం ఇవ్వాలని.. జీవో నెంబర్ 58, 59 ప్రకారం సాగుభూమిపై హక్కులు కల్పించి..విక్రయించుకునేందుకు సైతం హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఎస్సీలకు కార్పొరేట్ విద్యాసంస్థల్లో 25శాతం ఉచిత విద్యను కచ్చితంగా అమలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఎస్సీ కార్పొరేషన్‌కు రూ.15వేల కోట్ల నిధులు అందజేసి సబ్సిడీపై ఎస్సీలకు రుణాలు అందజేయాలని కోరారు.

## వైభవంగా ఓంకారేశ్వర ఆలయ వార్షికోత్సవం



**అక్షరటుడే, కామారెడ్డి:** పట్టణంలోని జయశంకర్ కాలనీ లో గౌరీ సమేత ఓంకారేశ్వర ఆలయ నాలుగో వార్షికోత్సవ వేడుకలు వైభవంగా సాగుతున్నాయి. గురువారం ఉదయం నుంచే ఆలయానికి భక్తులు పోటెత్తారు. స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వార్షికోత్సవం సందర్భంగా ఉదయం గణపతి పూజ, గోమాత పూజ నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయం ఆవరణలో లోక కల్యాణార్థం హోమ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవంలో ప్రముఖ శాస్త్రవేత్త, ఎల్లారెడ్డి బీజేపీ నాయకుడు పైడి ఎల్లారెడ్డి స్వామి వారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు కపిల ప్రభాకర్, కంది శివరాములు, వీరన్న పటేల్, పట్నం శెట్టి శ్రీనివాస్, మాధవి శెట్టి ఆంజనేయులు, గంజి సంగమేశ్వర్, శేవెళ్ల రాజు పటేల్, బండాయప్ప స్వామి, నాగేష్ పాల్గొన్నారు.